క్లుప్తంగా

కోటిపల్లి ఫిషర్‌మన్ సొసైటీ కార్యవర్గం ఎన్నిక



బందోబస్తు మధ్య జరిగిన ఫిషర్‌మన్ సొసైటీ ఎన్నిక

కె.గంగవరం: మూడేళ్ల తరువాత కోటిపల్లి గ్రామానికి చెందిన ఫిషర్‌మన్ సొసైటీ ఎన్నిక ప్రశాంతంగా జరిగింది. స్థానిక ఎస్సై జానీబాషా, సిబ్బంది బందోబస్తు మధ్య జరిగిన ఎన్నికలో చైర్మన్‌గా ఓలేటి సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షుడిగా మల్లాడి అబ్బులు, కార్యదర్శిగా పంతాడి రమేష్ వర్మ, డైరెక్టర్లుగా కాలాడి నాగబాబు, రచ్చా శ్రీను, మల్లాడి సత్తిబాబు, పెమ్మాడి నూకరాజు, పెమ్మాడి శ్రీను, పెసంగి రాంబాబులను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొత్తగా ఎన్నికైన కార్యవర్గాన్ని సొసైటీ, మత్స్యకార పెద్దలు అభినందించారు.

మార్కెట్ కమిటీ మొదటి సమావేశం



మార్కెట్ కమిటీ తొలి సమావేశానికి హాజరైన చైర్మన్ రిష్వంత్‌రాయ్, సభ్యులు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మార్కెట్ యార్డులో మార్కెట్ కమిటీ తొలి సమావేశం చైర్మన్ అక్కల రిష్వంత్ రాయ్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. సభ్యుడు నారపరెడ్డి బలరాం రైతులకు ఉపయోగపడే విధంగా పుంత రోడ్లను అభివృద్ధి చేయాలని కోరారు. జగ్గంపూడి గనిరాజు అకాల వర్షాల సమయంలో చేతికి వచ్చిన పంట తడిసి పోకుండా రైతులకు అవసరమైన బరకాలు అందించే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లాలని కోరారు. మార్కెట్ కమిటీ ఆదాయం పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కమిటీ సభ్యులంతా ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సెక్రటరీ పి.వాసుదేవరావు, వ్యవసాయ శాఖ ఏడీ బి.నాగకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

కాజులూరు: కుయ్యేరు 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లోని దుగ్గుదుర్రు ఫీడర్ పరిధిలోని పలు గ్రామాలకు బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు కాకినాడ ఏపీఈపీడీసీఎల్ డీఈ ఎస్.ఉదయ్‌భాస్కర్ తెలిపారు. మంగళవారం గొల్లపాలెం మెయిన్ సబ్‌స్టేషన్ ఏఈ వీర్రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కుయ్యేరు 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి కాజులూరుకు కొత్త విద్యుత్ లైన్ నిర్మాణం పనులు జరుగుతున్నాయన్నారు. లైన్ల ఏర్పాటులో భాగంగా ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయవలసి వస్తుందన్నారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

పార్లమెంటరీ విలువలపై రేపు సదస్సు

కపిలేశ్వరపురం: ఈ నెల 25న రామచంద్రపురంలోని చెలికాని రామారావు భవనంలో ‘‘సంక్షోభంలో పార్లమెంటరీ విలువలు-మన కర్తవ్యం’’ అంశంపై సదస్సు నిర్వహించనున్నట్టు సామాజిక కార్యకర్త పెద్దింశెట్టి రామకృష్ణారావు మంగళవారం అంగరలో తెలిపారు. డాక్టర్ చెలికాని రామారావు స్మారక కమిటీ నిర్వాహకులు డాక్టర్ స్టాలిన్ ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహించనున్నట్టు తెలిపారు. సదస్సులో ఉస్మానియా విశ్వ విద్యాలయం ప్రొఫెసర్ సి.కాశీం, సహకార రంగ ఉద్యమ నాయకుడు మానం ఆంజనేయులు ప్రసంగిస్తారని రామకృష్ణ తెలిపారు.

బస్టాండ్‌లో సేవలు మెరుగుపర్చాలి



మండపేట బస్టాండ్‌ను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట బస్టాండ్‌కు ప్రయాణికుల తాకిడి పెరిగిన నేపథ్యంలో తగిన పారిశుధ్య చర్యలు, మెరుగైన సౌకర్యాల ఏర్పాటు చేయాలని, సిబ్బందిని, ఆర్టీసీ అధికారులను మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి ఆదేశించారు. మున్సిపల్ శానిటేషన్ విభాగం అధికారులతో కలిసి బస్ స్టాండ్‌ను పరిశీలించారు. అక్కడి మరుగుదొడ్ల వద్ద విధులు నిర్వహించే సిబ్బందికి పలు సూచనలు చేశారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను ఆదేశించారు.

రేపు సామూహిక సత్యసాయి వ్రతాలు

అంబాజీపేట: భగవాన్ సత్యసాయిబాబా వారి అవతార శతాబ్ది జన్మదిన వేడుకలను పురస్కరించుకుని ఈనెల 25న అంబాజీపేట కొర్లపాటివారి పాలెం సత్యసాయి సేవా కేంద్రంలో ఉదయం 9 గంటలకు సామూహిక సత్యసాయి వ్రతాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 100 మందికి వస్త్రదానం, 9 మంది గర్భిణులకు సీమంతాలు చేయనున్నామన్నారు. సాయంత్రం నాలుగు గంటలకు గ్రామోత్సవం జరుగుతుందన్నారు.

జలపుష్పాలకు పొంచి ఉన్న ముప్పు

- అంతరించిపోతున్న నల్లజాతి చేపలు
- అక్కడక్కడా దర్శనమిస్తున్న బొమ్మిడాలు
- అధికమైన రసాయన ఎరువుల వినియోగం
- కలుషితమవుతున్న కాలువలు, చెరువుల్లోని నీరు



అంతరించిపోతున్న బొమ్మిడాలు

రాయవరం: పెరుగుతున్న నాగరికత కొన్ని సౌకర్యాలను తీసుకువస్తుంటే, అదే సమయంలో సమాజానికి ఎంతో విలువైన సంపదను దూరం చేస్తోంది. పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానం కారణంగా ఇప్పటికే కొన్ని రకాల వన్యప్రాణులు కనుమరుగయ్యే పరిస్థితి ఉండగా అదే కోవలో అరుదైన మత్స్య సంపద కూడా కనుమరుగవుతోంది.

సహజ సిద్ధంగా పెరిగే చేపలు ఎంతో రుచి

ఒకప్పుడు కాలువల్లో ఎక్కువగా కనిపించే నల్ల జాతి రకాల జలపుష్పాలు అంతరించిపోతున్నాయి. ముఖ్యంగా పంట కాలువల్లో, బోదెల్లో ఎక్కువగా మట్టగిడసలు, జెల్లకొంకులు, నల్ల బొచ్చులు, గొరసలు, మార్పు, కొర్రమీను, బొమ్మిడాలు, నల్ల రొయ్యలు వంటి మత్స్య సంపద ఎక్కువగా కన్పించేవి. జూన్‌లో కాలువల్లోకి నీరు వదలడం నుంచి ప్రారంభమైన అనంతరం ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో కాలువల్లో అధికంగా నల్ల, తెల్ల చేపలు, రొయ్యలు పెరిగేవి. కాలువల్లో సహజసిద్ధంగా పెరిగే చేపలు ఎంతో రుచిగా ఉండడంతో మాంసాహార ప్రియులు వీటిని ఎక్కువగా ఆహారంగా తీసుకుంటారు. ముఖ్యంగా వర్షాకాలంలో పనులు లేక ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితుల్లో పల్లెల్లో కూర కోసం రైతులు, మత్స్యకారులు, మాంసాహార ప్రియులు వలలు, మాములు, గేలం సహాయంతో కాలువలు , పంట బోదెల్లో చేపలను వేటాడేవారు. ప్రస్తుతం అరుదైన నల్లజాతి చేపలు కనుమరుగవుతున్నాయి.

మత్స్యసంపదకు ప్రమాదం

పంటల సాగుకు రసాయనిక ఎరువులు, పురుగు మందులు అధికంగా వినియోగించడంతో వాటి వల్ల వచ్చే వ్యర్థాల కారణంగా కాలువలు, చెరువుల్లోని జలాలు కలుషితమవుతున్నాయి. జల కాలుష్యం మత్స్యసంపద ఉనికికి ప్రమాదం ఏర్పడుతోంది. గతంలో వర్షాకాలం వచ్చిందంటే కాలువలు, బోదెల్లో చేపల కోసం మాములు కట్టేవారు. మాములలో పడిన చేపలను ఆహారానికి వినియోగించుకోవడంతో పాటు వాటిని మార్కెట్‌కు తరలించి విక్రయించేవారు. ఇప్పుడు పంట బోదెల్లో, కాలువల్లో చేపలు దొరకని పరిస్థితి ఏర్పడింది. కాలువలు కట్టే సమయంలో నీటి ప్రవాహం తగ్గడంతో ఎన్నో చేపలను స్థానికులు పోటీపడి పట్టుకునేవారు. ఇప్పుడా పరిస్థితి కనిపించడం లేదు.

కానరాని కొర్రమీను

జలపుష్పాల్లో కొరమేను అంటే ఇష్టపడని వారుండరు. పెద్ద హోటళ్లలో కొర్రమీను కూరను ప్రత్యేకంగా చేయించి విక్రయిస్తారు. ఆరోగ్యరీత్యా చాలా మంది కొర్రమీను కూర ఆహారంగా తీసుకుంటారు. ముఖ్యంగా కాలువలు, పంట బోదెల్లోని బురద నీటిలో పెరిగే కొర్రమీను చేపలు నేడు కనిపించడం లేదు.

బావురుమంటున్న బొమ్మిడాలు

బొమ్మిడాలు కూడా అంతరించి పోయే దశకు చేరుకున్నాయి. సూదంటి మూతిని కలిగి ఉండే బొమ్మిడాల పులుసు ఎంతో ప్రత్యేకతను సంతరించుకుని మాంసాహార ప్రియుల నోరూరిస్తుంది. బురదలో అడుగుభాగంలో ఉండే బొమ్మిడాలు నేడు దాదాపు కనుమరుగయ్యే స్థితి నెలకొంది.

ప్రమాదంలో మరిన్ని మత్స్య జాతులు

ఇవే కాకుండా చెట్టు ఎక్కే చేపగా ప్రసిద్ధి పొందిన పొట్టి గొరస, ఇంగిలాయి, మట్టగిడస, మార్పు, జెల్లకొంకులు వంటి చేపలు అంతరించి పోతున్నాయి. అందుకే కాలువల్లో మావులు, ముళ్ల కంపలు కట్టేవారు తగ్గిపోతున్నారు. అరుదైన మత్స్య సంపదను కాపాడుకోకపోతే భవిష్యత్తులో బొమ్మిడాలు, కొరమేనులు వంటి చేపలు ఉండేవన్న విషయాన్ని ముందుతరాలకు చిత్రాల ద్వారా చూపించే పరిస్థితి ఉంటుంది.

తిండామంటే దొరకడం లేదు



గతంలో వలలో లెక్కకు మించి చేపలు పడేవి. కాలువల్లో లభించే నల్లజాతి చేపలు తిందామంటే నేడు దొరకని పరిస్థితి. జల కాలుష్యమే ఈ పరిస్థితికి కారణం. అక్కడక్కడా దొరుకుతున్న కాలువ చేపల ధరలు చుక్కలనంటుతున్నాయి. – కొప్పిశెట్టి రామకృష్ణ, వ్యవసాయ కూలీ, రాయవరం

కాలువ చేప రుచి అద్భుతం



కాలువల్లో దొరికే నల్ల, తెల్ల చేపల రుచి అద్భుతం. గతంలో వర్షాకాలంలో పంట బోదెలు, కాలువల్లో అధికంగా చేపలు లభించేవి. పురుగు మందులు, రసాయన ఎరువుల ప్రభావానికి చేపలు అంతరించిపోతున్నాయి.

– పలివెల రవిబాబు, కూర్మాపురం, రాయవరం మండలం

ఆరోగ్యంపై అవగాహన అవసరం



శలపాకలో పౌష్టికాహారంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది



ఉచిత వైద్య శిబిరం వద్ద మాట్లాడుతున్న వైద్యులు విష్ణువర్ధన్

కె.గంగవరం: గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు ఆరోగ్యంపై సంపూర్ణ అవగాహన ఉండాలని పామర్రు పీహెచ్‌సీ వైద్యులు విష్ణువర్ధన్, హర్షిత అన్నారు. మండలంలోని యండగండి గ్రామంలో స్వస్థ్ నారీ–సశక్త పరివార్ అభియాన్‌లో భాగంగా మహిళలకు స్క్రీనింగ్ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ వయస్సుతో సంబంధం లేని అనేక రకాల ఆరోగ్య సమస్యలకు ఈ స్క్రీనింగ్ పరీక్షలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. మహిళలకు ఏ చిన్న ఆరోగ్య సమస్యలు వచ్చినా వెంటనే ప్రభుత్వ ఆసుపత్రులను సంప్రదించి వైద్యుల సూచనలు పాటించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో నైపుణ్యం కలిగిన వైద్యులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దత్తుడు, బీజేపీ నాయకులు కొప్పిశెట్టి చంద్రరావు, అవసరాల వెంకట రమణమూర్తి ఆరోగ్య విస్తరణాధికారి వీరప్రకాష్‌రావు, హెల్త్ సూపర్‌వైజర్ కామేశ్వరరావు, భాగ్యవతి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆహార నియమాలు పాటిస్తేనే మెరుగైన ఆరోగ్యం

కాజులూరు: ఆరోగ్య నియమాలు సక్రమంగా పాటిస్తేనే మనిషి మెరుగైన ఆరోగ్యాన్ని పొందగలుగుతాడని గొల్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి సీవీఎల్ శ్రేయ అన్నారు. శలపాక పీహెచ్‌సీ సబ్ సెంటర్ వద్ద మంగళవారం వైద్యాధికారులు స్వస్థ్ నారీ–సశక్త్ పరివార్ అభియాన్ నిర్వహించి 128 మంది మహిళలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. వైద్యులు మాట్లాడుతూ మహిళలు నూనెలు, పంచదార, ఉప్పు వాడకాన్ని తగ్గించి ఫైబర్, పీచు పదార్థాలు ఎక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పోతుల గనిరాజు, ఎంపీటీసీ దడాల రమేష్, ఉప సర్పంచ్ పబ్బినీడి శ్రీనివాసరావు, స్థానిక డాక్టర్ చంద్ర వీర్రాజుచౌదరి, పోతురాజు బీమారావు, డేగల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు వైద్య పరీక్షలు

కపిలేశ్వరపురం (మండపేట): మహిళల ఆరోగ్య పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని మండపేట 4వ వార్డు సాయిబాబా మందిరం ప్రాంగణంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో స్వస్థ నారీ– స్వశక్త అభియాన్ పరివార్ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలన్నారు. డాక్టర్ రమ్య లక్ష్మి గర్భిణులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార పదార్థాలను ప్రదర్శించారు. ద్వారపూడి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో ఆర్థోపెడిక్ వైద్యుడు డాక్టర్ వంశీ, వైద్యాధికారి డాక్టర్ షీర జాన్ వెస్లీ మహిళలకు ఆరోగ్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కోరుమిల్లి గ్రామ శివారు చిన కోరుమిల్లిలో వాకతిప్ప పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ మానస సుప్రియ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. మహిళలకు రక్తహీనత, స్త్రీల సంబంధిత, క్యాన్సర్ తదితర వైద్య పరీక్షలు చేశారు. సర్పంచ్ ఆచంట సత్యనారాయణ, కార్యదర్శి కామేశ్వరి, 104 సిబ్బంది పాల్గొన్నారు.

వృత్తి విద్యలో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి



మాచరలో నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ విజయ్‌కుమార్

కపిలేశ్వరపురం (మండపేట): వృత్తి విద్య ద్వారా మెరుగైన జీవితాన్ని గడపవచ్చని ఎంఈఓ ఖండవిల్లి విజయ్‌కుమార్ అన్నారు. మాచర పీఎంశ్రీ జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు చేస్తున్న ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. వృత్తి విద్యా కోర్సుల నాణ్యత పరిశీలనలో భాగంగా ఇంటర్మీడియట్ విద్యార్థులతో మమేకమై నైపుణ్య స్థాయిలను పరిశీలించారు. కుట్టు శిక్షణ, ఎంబ్రాయిడరీ కోర్సుల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకోవడం ద్వారా ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని ఎంఈఓ అన్నారు. వృత్తి విద్యా శిక్షకురాలు టి.లలిత పర్యవేక్షణలో 12 రోజులు పాటు క్షేత్రస్థాయిలో ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు.

జగన్మాతా నమోస్తుతే..

రామచంద్రపురం: పట్టణంలోని శివాలయం పార్కు వద్ద కనకదుర్గ అమ్మవారు మంగళవారం గాయత్రీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కొత్తూరు జోడు తూముల వద్ద వేంచేసిన కనకదుర్గా అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులను అలరించారు. రామచంద్రపురం మోడ్రన్ హైస్కూల్ వద్ద దసరా ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. హైందవ ధర్మాన్ని దుర్గా మాత అలంకరణల విశిష్టతను తెలియజేసేలా విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలను కనులపండువగా నిర్వహించారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ ఆర్.ఉమాదేవి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వర్లు, ఇంటర్మీడియెట్ పిన్సిపాల్ సీహెచ్ రాజేష్, హైస్కూల్ ఇన్‌చార్జి వై.రాజు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

రామచంద్రపురం రూరల్: దసరా మహోత్సవాల్లో భాగంగా మండలంలోని పలు దేవాలయాల్లో రెండో రోజు మంగళవారం అమ్మవారి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. దక్షిణ కాశీ ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో 12వ శక్తిపీఠం మాణిక్యాంబా అమ్మవారి సన్నిధిలో అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించారు. ద్రాక్షారామ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో వారణాసి కార్తికేయ బ్రహ్మత్వంలో రెండో రోజు బాలాత్రిపుర సుందరీ దేవి అవతారంలో కన్యకా పరమేశ్వరి అమ్మవారు అలరించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొమ్మిశెట్టి గోపాల్, ఉపాధ్యక్షుడు పసుమర్తి సూర్యశేఖర్, ప్రధాన కార్యదర్శి అప్పన రాజశేఖర్, కోశాధికారి వెచ్చా కిషోర్, కార్యదర్శులు పూజల్లో పాల్గొన్నారు. ఆదివారపుపేట శివబాలయోగి మహారాజ్ ఆశ్రమంలో పార్వతీ అమ్మవారు గాయత్రీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీశ్రీశ్రీ శివబాలయోగి మహారాజ్ ఆశ్రమ ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేయగా, ఆలయ అర్చకుడు బ్రహ్మత్వంలో పూజలు నిర్వహించారు.



బాలాత్రిపుర సుందరిగా ఆదివారపుపేట పార్వతీ అమ్మవారు



దుర్గాదేవి అవతారంలో ద్రాక్షారామ కన్యకాపరమేశ్వరి అమ్మవారు



గాయత్రీ దేవిగా రామచంద్రపురం శివాలయం పార్కు వద్ద వేంచేసిన కనకదుర్గ అమ్మవారు



గాయత్రీ దేవిగా కొత్తూరు జోడు తూముల వేంచేసిన కనకదుర్గ అమ్మవారు

నెలాఖరు నాటికి పంట నమోదు పూర్తి చేయాలి



పాణింగపల్లిలో రైతులకు సూచనలిస్తున్న ఏఓ సద్గురుమూర్తి

కె.గంగవరం: రైతులందరూ ఈ నెల 30వ తేదీలోపు ఈ–పంట నమోదు తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని ఏఓ సద్గురుమూర్తి అన్నారు. మండలంలోని పాణింగపల్లి, సత్యవాడ గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ శాఖ సిబ్బంది అందుబాటులో ఉన్నారని వారి ద్వారా ఈ–పంట నమోదు చేయించుకోవాలన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల కారణంగా వర్షాలు కురవడంతో పాటు ఎండ, ఉక్కపోత కారణంగా వరి పంటకు ఎండాకు తెగులు వచ్చే అవకాశం ఉందని దీని నివారణకు నత్రజని ఎరువుల వాడకం ఆపి నీరు తీసి మళ్లీ పెట్టుకోవాలన్నారు. దీంతో పాటు గోమూత్రాన్ని 5 మిల్లీలీటర్ చొప్పున లీటర్ నీటిలో పిచికారీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ చీకట్ల సునీత, సలాది సత్యవతి, వీఏఏలు సాయిశ్రీ, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్‌పై విస్తృత ప్రచారం



సూర్యఘర్ పథకం బ్రోచర్ ప్రదర్శిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీదేవి, విష్ణుమూర్తి తదితరులు

రామచంద్రపురం రూరల్: భారత ప్రభుత్వం సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు ఏపీఈపీడీసీఎల్ రామచంద్రపురం డివిజన్ పరిధిలో డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు ఆధ్వర్యంలో పీఎం సూర్యఘర్ పథకంపై విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా మంగళవారం రామచంద్రపురం మున్సిపల్ కార్యాలయంలోనూ, ద్రాక్షారామ సబ్‌స్టేషన్ వద్ద డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.విష్ణుమూర్తి, అసిస్టెంట్ ఇంజినీర్ మేడిశెట్టి వెంకటరమణలు అవగాహన సదస్సులు నిర్వహించి విద్యుత్ వినియోగదారులకు అవగాహన కల్పించారు. ఒకసారి పెట్టుబడితో 20 ఏళ్ల వరకు చార్జీలు లేని విద్యుత్‌ను ఉపయోగించుకోవడమే కాకుండా మిగులు విద్యుత్ ఉంటే ఆదాయం కూడా వస్తుందని అవగాహన కల్పించారు. ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వం గరిష్టంగా రూ.78 వేల వరకు సబ్సిడీ ఇస్తుందన్నారు. అంతేకాకుండా బ్యాంకు రుణాలు కూడా ఇస్తున్నాయని, కరెంటు బిల్లులు కట్టుకునే బదులు బ్యాంకు రుణాల వాయిదాలు కొన్నాళ్ల పాటు కట్టుకుంటే ఆ తరువాత పూర్తిగా ఉచితంగా విద్యుత్‌ను వాడుకునే వెసులుబాటు కలుగుతుందన్నారు. అంతేకాకుండా తరిగిపోతున్న బొగ్గు వంటి విద్యుత్ వనరులను ఆదా చేసుకుంటూ ఎన్నటికీ తరగతి సూర్య శక్తిని వాడుకోవడం ద్వారా అటు పర్యావరణానికి కూడా మేలు చేసిన వారమవుతామని వివరించారు. ఇప్పటికే సోలార్ విద్యుత్ వాడుతున్న ద్రాక్షారామ ఏపీసీఎస్ చైర్మన్ ముప్పనపల్లి గణేష్, స్టేట్‌బ్యాంకు కస్టమర్ పాయింట్ అయ్యప్ప తదితరుల అనుభవాలను వినియోదారులకు వివరించారు. కార్యక్రమంలో రామచంద్రపురం మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, మున్సిపల్ కమిషనర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల పరిరక్షణ సమితి ఏర్పాటు



మండపేటలో ఆలయాల పరిరక్షణ సమితి నాయకులు

కపిలేశ్వరపురం (మండపేట): హిందూ ఆలయాల పరిరక్షణ సమితి పేరుతో మండపేటలో మంగళవారం కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ అధ్యక్షుడిగా మద్దుల సుబ్బారావు, ప్రధాన కార్యదర్శిగా చుంద్రు భార్గవ్ సాయిరాం చౌదరి, సభ్యులను ఎన్నుకున్నారు. సమితి ఆంధ్రప్రదేశ్ కమిటీ అధ్యక్షుడు కర్నాలు బసవరాజు పర్యవేక్షణలో ప్రధాన కార్యదర్శి పిల్లాడి రుద్రయ్య, ఆర్యవైశ్య వాణిజ్య విభాగం అధ్యక్షుడు నల్లమిల్లి సుబ్బారావు, కోన సత్యనారాయణ, కంకటాల మురళీకృష్ణ, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుడూ భారతీయ సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో రవి, రామరాజు, వాకచర్ల గుప్తా, కంచర్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


సేవలు నిరుపమానం



విశ్రాంత ఉపాధ్యాయులు సుబ్బారావు, శ్రీరాములు దంపతులను సత్కరిస్తున్న శ్రీదేవి తదితరులు

రామచంద్రపురం: పట్టణంలోని రత్నంపేట హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు విత్తనాల సుబ్బారావు, అదే పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేసిన కాదా శ్రీరాములు ఇద్దరికీ ఉద్యోగ విరమణ సందర్భంగా దంపతీ సమేతంగా మంగళవారం ఘనంగా సత్కరించారు. పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయిని ఎస్ఎస్ పద్మావతి అధ్యక్షతన జరిగిన సన్మాన సభలో వక్తలు మాట్లాడుతూ మూడున్నర దశాబ్దాలుగా ఉపాధ్యాయ వృత్తిలో నిబద్ధతతో వారు అందించిన సేవలు నిరుపమానమని కొనియాడారు. కార్యక్రమంలో రామచంద్రపురం మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, మార్కెట్ కమిటీ చైర్మన్ అక్కల రిష్వంత్‌రాయ్, మంత్రి సుభాష్ తండ్రి సత్యం, కృత్తివెంటి పేర్రాజు పంతులు ట్రస్ట్ చైర్మన్ సలాది నాయుడు మాస్టారు, ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయిశ్రీనివాస్, ఎంఈఓ వాసంశెట్టి నాగేశ్వరి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గరికిపాటి సూర్యనారాయణ, మేడిశెట్టి శేషారావు తదితరులు పాల్గొన్నారు.

గురువు చూపిన బాటలో పయనించాలి



గాయత్రీదేవిగా విజయదుర్గ అమ్మవారు

రాయవరం: మనలో ఉండే అజ్ఞానాన్ని తొలగించే గురువు చూపిన బాటలో పయనిస్తేనే అమ్మ కృపకు పాత్రులవుతారని సాహితీవేత్తలు కాశీభట్ల సత్యనారాయణ, గొర్తి సుబ్రహ్మణ్య శాస్త్రి భక్తులకు పిలుపునిచ్చారు. రాయవరం మండలం వెదురుపాక విజయదుర్గా పీఠంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం భక్తులనుద్దేశించి వారు ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. విజయదుర్గా పీఠాధిపతి వాడ్రేవు వెంకటసుబ్రహ్మణ్యం(గాడ్) గురుతత్వాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల ప్రాధాన్యతను, దేవి భాగవతాన్ని వారు వివరించారు. పీఠం అడ్మినిస్ట్రేటర్ బాపిరాజు, సాహితీవేత్తలు సత్యనారాయణ, సుబ్రహ్మణ్యశాస్త్రి దుశ్శాలువాతో వారిని సత్కరించారు. విజయదుర్గా పీఠంలో విజయదుర్గా అమ్మవారు భక్తులకు గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. పీఠం పురోహితుల ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు చేశారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు పీఠానికి పోటెత్తారు. పూజల అనంతరం భక్తులు పీఠాధిపతి గాడ్ ఆశీస్సులు పొందారు. భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్, విజయదుర్గా సేవా సమితి ప్రతినిధులు గాదె భాస్కరనారాయణ, సత్యవెంకటకామేశ్వరి, పెదపాటి కనకదుర్గ, బలిజేపల్లి రమ ఏర్పాట్లు పర్యవేక్షించారు.



అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారు

ఓక్ వీధి వ్యాపారులకు నేడు ప్రత్యేక మేళా

కపిలేశ్వరపురం (మండపేట): మండపేటలో బుధవారం ఉదయం 10 గంటలకు పట్టణంలోని వివేకానంద పాఠశాలలో వీధి వ్యాపారుల సాధికారత కోసం లోక్ కల్యాణ్ మేళా– పీఎం స్వనిధి 2.0 పేరుతో ప్రత్యేక మేళా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు కమిషనర్ టీవీ రంగారావు మంగళవారం తెలిపారు. వీధి వ్యాపారులకు ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించడం, వ్యాపారులకు గుర్తింపు కార్డులు జారీ చేయడం, పీఎం స్వనిధి పథకం ద్వారా రూ.15 వేలు నుంచి 50 వేలు వరకూ రుణం పొందేందుకు దరఖాస్తులను స్వీకరించడం, డిజిటల్ పేమెంట్లపై అవగాహన కల్పించడం, రుణ సదుపాయానికి బ్యాంకులను సంప్రదించడం తదితర అంశాలపై వీధి వ్యాపారులకు అవగాహన కల్పిస్తామని కమిషనర్ తెలిపారు.

వెంటూరులో పోషణ మాసోత్సవాలు

రాయవరం: వెంటూరు పంచాయతీ పరిధిలో మంగళవారం రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. మాచవరం అంగన్‌వాడీ సెక్టార్ సూపర్‌వైజర్ బి.ఈశ్వరి ఆధ్వర్యంలో పౌష్టికాహార ప్రాధాన్యతను వివరించారు. సర్పంచ్ వాసంశెట్టి వెంకట్రావు, ఉప సర్పంచ్ నున్న ప్రదీప్‌కుమార్, ఎంపీటీసీ వాసంశెట్టి విజయకుమార్, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ వర్కర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

కపిలేశ్వరపురం (మండపేట): స్మార్ట్ రేషన్ కార్డులను మండపేటలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి 20వ వార్డు లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను మంగళవారం అందజేశారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టేందుకు చర్యలు



మండపేటలో దుకాణంలో తనిఖీ చేస్తున్న శానిటేషన్ సెక్రటరీలు

కపిలేశ్వరపురం (మండపేట): వ్యాపారులు, కొనుగోలుదారులు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని విడనాడి, గుడ్డ సంచులు, జూట్ బ్యాగులు వాడాలని మండపేట మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు సూచించారు. పట్టణ పరిధిలోని పలు దుకాణాల్లో మంగళవారం శానిటేషన్ విభాగం అధికారులు తనిఖీలు చేశారు. కృష్ణ టాకీస్ వద్ద శివయ్య పాన్ షాపు వద్ద చెత్తను గుర్తించి రూ.వెయ్యి జరిమానా విధించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టేందుకు చర్యలు చేపట్టామని, కేపీ రోడ్డులోని జవహర్‌లాల్ మున్సిపల్ స్కూల్ వద్ద మెప్మా విభాగం ద్వారా గుడ్డ సంచులు, జూట్ బ్యాగులు తక్కువ ధరకే అమ్మకానికి సిద్ధంగా ఉంచామని తెలిపారు.